క్లుప్తంగా

డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడిగా పల్లె మధుకృష్ణ



చౌటుప్పల్ రూరల్ : మండలంలోని జైకేసారం గ్రామానికి చెందిన పల్లె మధుకృష్ణ డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా యువజనుల సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. స్థానికంగా ఉన్న పరిశ్రమల్లో స్థానిక యువతకు ఉపాధి కల్పించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని అన్నారు.

తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉపాధ్యక్షుడిగా సిద్దులు



గుండాల : మండలంలోని అనంతారం గ్రామానికి చెందిన తెల ంగాణ ఉద్యమకారుడు చెరుపల్లి సిద్దులును తెలంగాణ ఉద్యమకా రుల ఫోరం జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమిస్తూ ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చామ శ్రీనివాస్ ప్రకటించారు. ఈ సందర్భంగా మంగళవారం సిద్దులు విలేకరులతో మాట్లాడారు. ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఉద్యమకారులను గత ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ప్రజలు, ఉద్యమకారులు బుద్ధిచెప్పారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారులకు పట్టించుకుని రాష్ట్ర వెల్ఫేర్ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు.

బెల్ట్ దుకాణాలను అరికట్టాలి



సీఐకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆలేరురూరల్ : గ్రామాల్లో నిర్వహిస్తున్న బెల్ట్ దుకాణాలను, అక్రమ మద్యాన్ని అరికట్టాలని బీజేపీ మండల అధ్యక్షుడు పూజారి కుమార స్వామి డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయంలో సీఐ దీపకకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. గ్రామాల్లో బెల్టు షాపులు బార్లను తలపిస్తున్నాయని, అర్ధరాత్రి కూడా మద్యం విక్రయిస్తున్నారని, ఈ విషయంలో పోలీసులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని అన్నారు. తక్షణమే బెల్టు షాపుల నిర్వాహకులపై కేసులు నమోదు చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు భోగ శ్రీనివాస్, లక్ష్మి, తేరాల శంకర్, బైరి మహేందర్, అర్చన, రాజు, రవి, రాజు, కిషన్ ఉన్నారు.

వాటర్‌ప్లాంట్ నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న గ్రామ ప్రత్యేకాధికారి శ్రీధర్‌రెడ్డి

చౌటుప్పల్ రూరల్ : మండలంలోని జైకేసారం ఎస్సీకాలనీలో దివీస్ పరిశ్రమ సహకారంతో ఏర్పాటు చేయనున్న వాటర్‌ప్లాంట్ నిర్మాణానికి మంగళవారం గ్రామ ప్రత్యేకాధికారి శ్రీధర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామాభివృద్ధికి దివీస్ పరిశ్రమ సహకారం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మందుల శ్రీశైలం, మాజీ వార్డు సభ్యుడు పల్లె మధుకృష్ణ, కార్యదర్శి సరిత, నాయకులు ఎం.శేఖర్, జనార్దన్‌రెడ్డి, బోదాసు వెంకటేష్, దివీస్ ప్రతినిధులు గోపి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు దుస్తుల పంపిణీ



దుస్తులు అందజేస్తున్న దాత కుటుంబ సభ్యులు

వలిగొండ : మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్థానిక పూర్వ విద్యార్థి కూకట్‌పల్లి సీఐగా పనిచేస్తున్న బత్తిని వెంకటేష్ మంగళవారం దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఆలకుంట శ్రీనివాస్, బత్తిని బాలశెట్టి, గోవిందమ్మ, పాఠశాల ఉపాధ్యాయులు వరమ్మ, కవిత, ధనంజయ్య, రమేష్ పాల్గొన్నారు.

తెలంగాణలో టీడీపీకి పూర్వవైభవం తీసుకువస్తాం

చౌటుప్పల్ : తెలంగాణలో టీడీపీకి పూర్వవైభవం తీసుకువస్తామని టీడీపీ జాతీయ పొలిట్‌బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు, టీటీడీ బోర్డు మెంబర్ నన్నూరి నర్సిరెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన మునుగోడు నియోజకవర్గ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. మునుగోడు అసెంబ్లీ కన్వీనర్ బడుగు లక్ష్మయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో కుందారపు కృష్ణమాచారి, షరీఫ్, పార్వతమ్మ, అశోక్, సుబ్బారావు, కృష్ణయ్య, యాదయ్య, వెంకటేశం పాల్గొన్నారు.

● రైతుల్లో సామాజిక బాధ్యత

గ్రామీణ ప్రాంతాల్లోని బీటీ, సీసీరోడ్లు దెబ్బతినడానికి ప్రధాన కారణం ట్రాక్టర్లను ఫుల్‌వీల్స్‌లో రోడ్లపై తిప్పడం. రామన్నపేట మండలంలోని వెల్లంకి గ్రామానికి చెందిన రైతు తన ఫుల్‌వీల్స్ బిగించిన ట్రాక్టర్‌తో ఒక రైతు పొలం నుంచి మరో రైతు పొలానికి బీటీ, సీసీరోడ్డుపై వెళ్లకుండా సామాజిక బాధ్యతగా మరో ట్రాక్టర్ సహాయంతో తరలించి ఆదర్శంగా నిలిచారు. రోడ్లు ధ్వంసం కాకుండా రైతులు బాధ్యతగా వ్యవహరించడం వారి సామాజిక స్పృహకు నిదర్శనమని పలువురు కొనియాడారు.

– రామన్నపేట



ఫుల్‌వీల్స్ బిగించిన ట్రాక్టర్‌ను మరో ట్రాక్టర్ సహాయంతో తరలిస్తున్న రైతులు

● దారి ఇలా..ప్రయాణించేది ఎలా?

రామన్నపేట మండలంలోని జనంపల్లి– శివనేనిగూడెం (చిట్యాల మండలం) గ్రామాల మధ్య పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో బీటీరోడ్డు నిర్మించారు. సుమారు పది సంవత్సరాల క్రితం పీఎంజీఎస్‌వై నిధులతో నిర్మించిన ఈ రోడ్డులో జనంపల్లి, ఇస్కిళ్ల, కక్కిరేణి, మునిపంపుల, దుబ్బాక తదితర గ్రామాలకు చెందిన ప్రయాణికులు నిత్యం చిట్యాల మండల కేంద్రానికి రాకపోకలు సాగిస్తుంటారు. ప్రస్తుతం రోడ్డు చెట్లపొదలతో మూసుకుపోయి ప్రమాదకరంగా మారింది. మూలమలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు కనబడక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లపొదలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

– రామన్నపేట



చెట్ల పొదలతో మూసుకుపోయిన జనంపల్లి-శివనేనిగూడెం రోడ్డు

నల్లబ్యాడ్జీలతో ఉద్యోగుల ఆందోళన



భువనగిరి టౌన్ : నిరసన వ్యక్తం చేస్తున్న కలెక్టర్ కార్యాలయ ఉద్యోగులు

భువనగిరిటౌన్ : వికారాబాద్ జిల్లాలోని కొడంగల్ నియోజకవర్గ పరిధిలో ఫార్మా పరిశ్రమ ఏర్పాటు కోసం ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లిన వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్‌పై, రెవెన్యూ సిబ్బందిపై జరిగిన దాడిని ఖండిస్తూ మంగళవారం స్థానిక కలెక్టర్ కార్యాలయ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం పలువురు ఉద్యోగులు మాట్లాడారు. ఉద్యోగులపై ఈ దాడి చేయడం హేయమైన చర్య అని, దాడి చేసిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీజీఓ అధ్యక్షుడు సి.జగన్‌మోహన్, ప్రసాద్, రెవెన్యూ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కె.శ్రీకాంత్, కలెక్టరు కార్యాలయ పర్యవేక్షకులు రామారావు, సైదులు, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి శ్యామేల్, బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి యాదయ్య, అసిస్టెంట్ ట్రెజరీ అధికారి మోహన్‌కుమార్ ఉన్నారు.

యాదగిరిగుట్ట రూరల్ : వికారాబాద్ జిల్లా కలెక్టర్, రెవెన్యూ ఉద్యోగులపై జరిగిన దాడిని ఖండిస్తూ మండల రెవెన్యూ అధికారులు మంగళవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ దేశ్యానాయక్, డిప్యూటీ తహసీల్దార్ నర్సింహారావు, ఆర్ఐలు విజయసింహారెడ్డి, శ్రీకాంత్ సీనియర్ అసిస్టెంట్ రాము, దేవా, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రాజాపేట : వికారాబాద్ జిల్లా కలెక్టర్, రెవెన్యూ అధికారులపై జరిగిన దాడిని నిరసిస్తూ మంగళవారం మండల తహసీల్దార్ కార్యాలయం అధికారులు నిరసన తెలియజేశారు. నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేస్తూ విధులకు హాజరయ్యారు. దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ దామోదర్, డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఆర్ఐలు నర్సింహులు, యాదగిరి, సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టర్‌పై దాడి సరికాదు

బొమ్మలరామారం : వికారాబాద్ జిల్లా కలెక్టర్‌తో పాటు సిబ్బందిపై దాడి చేయడం సరికాదని తహసీల్దార్ శ్రీనివాస్‌రావు అన్నారు. ట్రెసా పిలుపు మేరకు మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట రెవెన్యూ సిబ్బందితో కలిసి ఆయన నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంఆర్ఐ వెంకట్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

కలెక్టర్, తహసీల్దార్‌లపై దాడికి నిరసన

మోత్కూరు : వికారాబాద్ జిల్లాలోని కొడంగల్ నియోజకవర్గ పరిధిలో కలెక్టర్, తహసీల్దార్‌లతో పాటు రెవెన్యూ ఉద్యోగులపై కొంత మంది అల్లరి మూకలు చేసిన దాడి పట్ల మంగళవారం మండల తహసీల్దార్ కార్యాలయం ఉద్యోగులు, సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. అధికారులపై దాడికి పాల్పడిన అల్లరి మూకలను గుర్తించి చట్టరీత్యా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఉపేందర్, ఆర్ఐ దాసరి శ్రీనివాస్, సర్వేయర్ ఖాజావోద్దీన్, సిబ్బంది దాసరి వీరన్న, బాలకృష్ణ, లక్ష్మారెడ్డి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



యాదగిరిగుట్ట : తహసీల్దార్ కార్యాలయంలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

కార్మిక వ్యతిరేక కోడ్‌లు రద్దుచేసే వరకు పోరాటం



శిక్షణలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాల్‌రాజు

చౌటుప్పల్ : కేంద్రం కార్మిక వ్యతిరేక కోడ్‌లను రద్దు చేసే వరకు పోరాడుతామని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ.యూసూఫ్, ప్రధాన కార్యదర్శి బాల్‌రాజు అన్నారు. మంగళవారం పట్టణంలో నిర్వహించిన ఏఐటీయూసీ జిల్లా స్థాయి శిక్షణ శిబిరంలో వారు పాల్గొని సంఘం పతాకాన్ని ఆవిష్కరించి శిక్షణా తరగతులను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడారు. కార్మికుల సంక్షేమాన్ని చూడాల్సిన పాలకులు యాజమాన్యాల సంక్షేమాన్ని కోరుకుంటున్నాయని ధ్వజమెత్తారు. పరిశ్రమల యాజమాన్యాలకు వేలాది కోట్ల రాయితీలు ప్రకటిస్తున్న పాలకులు కార్మికుల శ్రేయస్సు కోసం ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదని విమర్శించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు, ఏఐటీయూసీ రాష్ట్ర ఉప కార్యదర్శి ఎం.నర్సింహులు మాట్లాడుతూ.. కార్మికుల హక్కుల కోసం నిర్వహించే పోరాటాలకు కమ్యూనిస్టులు ఎల్లవేళలా మద్దతు తెలుపుతారని అన్నారు. కార్మికుల సమస్యలపై నాయకులు నిరంతరం పోరాటాలు నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు యానాల దామోదర్‌రెడ్డి, పి.పర్వతాలు, కె.శ్రీనివాస్, బచ్చనగోని గాలయ్య, పల్లె శేఖర్‌రెడ్డి, వెంకటేష్, రాములు, ఇమ్రాన్, భాస్కర్, యాదయ్య, వెంకటేష్, మశ్చగిరి, తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా సాగుతున్న సమగ్ర కుటుంబ సర్వే



చౌటుప్పల్ రూరల్ : అంకిరెడ్డిగూడెంలో సర్వే చేస్తున్న ఎంపీడీఓ యాకుబ్ నాయక్

చౌటుప్పల్ రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే మండలంలోని 26గ్రామపంచాయతీల్లో పకడ్బందీగా కొనసాగుతుందని చౌటుప్పల్ ఎంపీడీఓ యాకుబ్‌నాయక్ అన్నారు. మండలంలోని పంతంగి, అంకిరెడ్డిగూడెం గ్రామాల్లో సర్వే జరుగుతున్న తీరును ఆయన పరిశీలించారు. మంగళవారం మండల వ్యాప్తంగా 103మంది ఎన్యుమరేటర్లు, 10మంది సూపర్‌వైజర్లతో 972 కుటుంబాలను సర్వే చేసినట్లు తెలిపారు. మండలంలోని 14,300 కుటుంబాలకు గాను నేటి వరకు 2352 కుటుంబాల సర్వే పూర్తైనట్లు వెల్లడించారు.

సర్వే పరిశీలన

గుండాల : మండల కేంద్రంలో కొనసాగుతున్న సమగ్ర కుటుంబ సర్వేను ఏఎస్ఓ శ్రీనివాస్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా 75మంది ఎన్యుమరేటర్లతో, ఏడుగురు సూపర్‌వైజర్లతో సర్వే 20గ్రామాల్లో చేస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట జూనియర్ అసిస్టెంట్ కృష్ణ, సిబ్బంది ఉన్నారు.

హోరాహోరీగా జోనల్‌స్థాయి క్రీడా పోటీలు



కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు

రాజాపేట : మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో జరుగుతున్న 10వ జోనల్‌స్థాయి క్రీడాపోటీలు మంగళవారం రెండోరోజు హోరాహోరీగా కొనసాగాయి. ఈ సందర్భంగా అథ్లెటిక్స్ అండర్-14లో 200 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ బహుమతిగా ఎం.చైతన్య (స్టేషన్ ఘన్‌పూర్), 600 మీటర్ల పరుగులో ద్వితీయ బహుమతిగా ఎం.మహేష్ (స్టేషన్‌ఘన్‌పూర్), లాంగ్ జంప్‌లో ఎం.మహేష్ (స్టేషన్‌ఘన్‌పూర్), అండర్ -17లో ప్రథమ ఆర్.ప్రణయ్ (స్టేషన్‌ఘన్‌పూర్), 500మీటర్ల పరుగులో అండర్- 17 ప్రథమ ఎస్.శివ(తిప్పర్తి), అండర్- 19లో ప్రథమ బి.గోపిచంద్ (మిర్యాలగూడ), డిస్కస్‌త్రోలో ప్రథమ ఎం.శంకర్ (స్టేషన్‌ఘన్‌పూర్), లాంగ్ జంప్‌లో ప్రథమ కార్తీక్‌రాజ్ (మునగాల) గెలుపొందారు. కాగా ఈ క్రీడాపోటీలను జోనల్ ఆఫీసర్ విద్యారాణి, డీసీఓ జగదీశ్వర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సుధాకర్, వైస్ ప్రిన్సిపాల్ బి.రాజు, క్రీడల సమన్వయకర్త జి.శ్రీనివాస్, పీడీ వెంకటేశ్వర్లు తదితరులు పర్యవేక్షించారు.

సామాజిక సేవలో భాగస్వాములు కావడం అభినందనీయం

బొమ్మలరామారం : సామాజిక సేవలో భాగస్వాములు కావడం అభినందనీయం సాయిధామం పీఠాధిపతి శ్రీ రామానంద ప్రభూజీ అన్నారు. మండలంలోని పెద్ద పర్వతాపూర్‌లోని సాయిధామం పాఠశాలలో మంగళవారం గీతాంజలి కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ ఎన్ఎస్ఎస్ యూనిట్ విద్యార్థులకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మహిళల ఆరోగ్యం-వ్యక్తిగత పరిశుభ్రత అనే అంశంపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు అన్నప్రసాదం, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ అధ్యాపకులు ఓడయ్య, మధుసూదన్‌రావు, ఆశ్రమ ఇన్‌చార్జ్ ట్రస్టీ డాక్టర్ చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలుస్తున్న మోదీ



మాట్లాడుతున్న పిట్టల శ్రీనివాస్

చౌటుప్పల్ : అవినీతి రహిత పాలన అందిస్తూ ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలుస్తున్న ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నాయకత్వాన్ని బలపర్చేందుకు ప్రతిఒక్కరూ బీజేపీకి అండగా నిలవాలని బీజేపీ ఓబీసీ మోర్చా నల్లగొండ జిల్లా అధ్యక్షుడు పిట్టల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మున్సిపాలిటీ పరిధిలోని లింగోజిగూడెంలో మంగళవారం నిర్వహించిన స్థానిక సంస్థల పర్వం-2024 సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రమనగోని శంకర్, అసెంబ్లీ కన్వీనర్ దూడల భిక్షంగౌడ్, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ పోలోజు శ్రీధర్‌బాబు, మున్సిపల్, మండల అధ్యక్షులు కంచర్ల గోవర్ధన్‌రెడ్డి, చినుకని మల్లేష్, జిల్లా కార్యదర్శులు ఆలె చిరంజీవి, బత్తుల జంగయ్య, నాయకులు ముత్యాల భూపాల్‌రెడ్డి, గుజ్జుల సురేందర్‌రెడ్డి, దాసోజు భిక్షమాచారి, అశోక్, రమేష్, సత్తయ్య, వెంకటేశం, మాధవి, పురుషోత్తం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి ఉర్సు ప్రారంభం

● వారం రోజుల పాటు సాగనున్న ఉత్సవాలు
● ముస్తాబైన దర్గాలు



ముస్తాబైన హజ్రత్ బుర్హానోద్దీన్ అవులియా దర్గా

భువనగిరిటౌన్ : పట్టణంలో ప్రతిఏటా జరుపుకునే ఉర్సుకు ఐదు దర్గాలు ముస్తాబయ్యాయి. ఈనెల 13నుంచి 21వతేదీ వరకు ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రతి దర్గా వద్ద రెండు రోజుల పాటు జరిగే సందల్ (గంధం), చిరాగ్ (దీపారాధన)తో పాటు పలురకాల పూజలు, ఖవ్వాలితో పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

కార్యక్రమాలు ఇలా..

నేడు హజ్రత్ బుర్హానోద్దీన్ అవులియా దర్గా సందల్ (గంధం), 15న హైదరాబాద్ చౌరస్తాలోని హజ్రత్ హాజీ హర్షైన్ దర్గా సందల్ ఊరేగింపు, 16న దీపారాధన, అదే రోజు ఖాజీ మహెల్లాలోని హజ్రత్ సయ్యద్ షా జమాల్ ఉల్ బహార్ అవులియ్ దర్గా సందల్ ఊరేగింపు ఉంటుంది. ఈ కార్యక్రమం స్థానిక గంజ్ మజీద్ నుంచి ప్రారంభం కానుంది. 17న కిసాన్‌నగర్‌లోని హజ్రత్ సయ్యద్ షా బుర్హానోద్దీన్ అవులియా దర్గా సందల్ ప్రదర్శన గంజ్ మజీద్ నుంచి ప్రారంభం కానుంది. 18న దీపారాధన కార్యక్రమం నిర్వహిస్తారు. 19న హైదరాబాద్ చౌరస్తాలోని హజ్రత్ సోంటేపీర్ అలై దర్గా సందల్ ఉత్సవాలు ఉంటాయి. 20న హజ్రత్ లాల్ షా వలీ ఉర్సు సందల్ ప్రదర్శన, 21న దీపారాధన నిర్వహించనున్నారు. ఎన్నోఏళ్లుగా కొనగుతున్న ఈ ఉత్సవాలకు కుల మతాలకతీతంగా రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి భక్తులు వచ్చి మొక్కులు చెల్లించుకుంటారు.

మద్యం సేవిస్తే చర్యలు

మోత్కూరు : గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలలోని ఆవరణల పరిధిలో మద్యం సేవిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ డి.రాంప్రసాద్ హెచ్చరించారు. మండలంలోని దాచారం అంగన్‌వాడీ కేంద్రం వద్ద గుర్తుతెలియని వ్యక్తులు మద్యం సేవించి సీసాలను పగులగొట్టడంతో అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే చిన్నారులకు ప్రమాదకరంగా మారింది. ఈ విషయం కలెక్టర్ దృష్టికి చేరడంతో ఆదేశాల మేరకు గ్రామంలో ప్రభుత్వ శాఖల అధికారులు యువజన సంఘాలు, బెల్టుషాపుల నిర్వాహకులతో తహసీల్దార్ ఆధ్వర్యంలో అవగాహన సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సీడీపీఓ జ్యోత్స్న, గ్రామ ప్రత్యేక అధికారి వెటర్నరి ఏడీ మోతీలాల్‌నాయక్, హెచ్ఎం వీరయ్య, ప్రేమలత, ఆర్ఐ దాసరి శ్రీనివాస్, సుమన్, ఏఎస్ఐ వెంకన్న, అంగన్‌వాడీ టీచర్ నర్మద, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఎండీ.షమీమ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

భువనగిరి రూరల్ : రాష్ట్రంలో రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాల మోసం చేస్తుందని రైతుబంధు సమితి మాజీ జిల్లా అధ్యక్షుడు కొలుపుల అమరేందర్ అన్నారు. మండలంలోని చందుపట్లలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. క్వింటాకు రూ.500బోనస్ ఇస్తామని చెప్పి కల్లబొల్లి మాటలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను నట్టేట ముంచుతున్నారని అన్నారు. అదేవిధంగా కౌలు రైతులకు రైతు భరోసా ఇస్తామని రైతు కూలీలకు నెలకు రూ.వెయ్యి ఇస్తామని చెప్పి రైతులను పట్టించుకునే నాధుడే లేకుండా పోయాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన వెంట మాజీ జెడ్పీటీసీ సుబ్బూరు బీరుమల్లయ్య, రైతుబంధు మాజీ మండల కన్వీనర్ కంచి మల్లయ్య, మాజీ ఎంపీపీ అతికేం లక్ష్మీనారాయణగౌడ్, రైతులు తదితరులు ఉన్నారు.

రైతులకు ఇబ్బంది కలుగకుండా చర్యలు

రామన్నపేట : ధాన్యం కొనుగోళ్ల విషయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తగిన చర్యలు తీసుకుంటున్నట్లు పీఏసీఎస్ చైర్మన్ నంద్యాల భిక్షంరెడ్డి, తహసీల్దార్ సి.లాల్‌బహదూర్ తెలిపారు. మంగళవారం మండలంలోని పల్లివాడ, ఇంద్రపాలనగరం, సిరిపురం గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన సందర్శించారు. అనంతరం కొనుగోళ్లు, ఎగుమతులు జరుగుతున్న తీరును పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. ఆరబెట్టిన ధాన్యాన్ని తీసుకువచ్చి మద్దతు ధరను పొందాలని సూచించారు. ఆయన వెంట రైతులు ఉన్నారు.

గ్రామంలోకి ఆర్టీసీ బస్సులు రావాలని ధర్నా



ధర్నా నిర్వహిస్తున్న గ్రామస్తులు

యాదగిరిగుట్ట రూరల్ : మండలంలోని వంగపల్లి గ్రామం లోపలికి ఆర్టీసీ బస్సులు రావాలని డిమాండ్‌చేస్తూ ఆ గ్రామస్తులు మంగళవారం హైదరాబాద్ -వరంగల్ ప్రధాన జాతీయ రహదారిపై ధర్నా నిర్వహించారు. రాత్రి వేళల్లో జాతీయ రహదారిపై గ్రామస్తులను దించేసి వెళ్తుండడంతో గ్రామ ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని వాపోయారు. వెంటనే అధికారులు ఏర్పాటు చేసిన వాల్స్‌ను తీసేసి, గ్రామం నుంచి బస్సులు పోయే విధంగా చూడాలని నిరసన వ్యక్తం చేశారు. అనంతరం స్థానిక పోలీసులు వచ్చి నచ్చజెప్పి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ధర్నాను విరమించారు. అనంతరం యాదగిరిగుట్ట ఏసీపీ రమేష్, డిపో మేనేజర్‌కు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చంద్రగాని జహంగీర్‌గౌడ్, రేపాక స్వామి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మంగళగిరి రవిచందర్, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు అచ్చిన క్రిష్ణస్వామి, సీస శేఖర్, మండల యూత్ అధ్యక్షులు ఎండీ అజ్జు, రేపాక మహేందర్, యడపల్లి మహేష్ పాల్గొన్నారు.

అనుమతులు లేకుండా నిల్వ చేసిన మందులు సీజ్



మందులను సీజ్ చేసిన జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్

భూదాన్‌పోచంపల్లి: మండలంలోని దేశ్‌ముఖి గ్రామంలో మంగళవారం యాదాద్రి భువనగిరి జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ అశ్విన్‌కుమార్ ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన ఆకుల గోపీనాథ్ ఎలాంటి అనుమతులు లేకుండా రూ.40వేల విలువైన 31 రకాల మందులను నిల్వ ఉంచినట్లు గుర్తించి వాటిని సీజ్ చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు డ్రగ్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు. సీజ్ చేసిన మందులను చౌటుప్పల్‌లోని కోర్టుకు అప్పగిస్తామని పేర్కొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

వలిగొండ : ఓ రైస్‌మిల్లులో అక్రమంగా నిల్వ ఉంచిన 240క్వింటాల పీడీఎస్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం ఎస్ఐ యుగంధర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రెడ్లరేపాకలో గల శ్రీఆంజనేయ బిన్నీ రైస్‌మిల్లులో యజమాని పంతంగి రాజు 240క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం నిల్వ చేసుకొని వేరే ప్రాంతానికి తరలిస్తున్నాడనే సమాచారం మేరకు దాడి చేసి బియ్యం లారీని పట్టుకున్నట్లు తెలిపారు. లారీ స్టేషనకు తరలించి మిల్లు యజమానిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సంక్షిప్త సమాచారం

యాదగిరిగుట్టలో లక్ష పుష్పార్చన

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయంలో మంగళవారం ఏకాదశి పూజలు వైభవంగా నిర్వహించారు. ఆలయ ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన మూర్తులకు లక్ష పుష్పార్చన పూజలు పాంచరాత్ర ఆగమ శాస్త్రానుసారంగా నిర్వహించారు. శ్రీస్వామి అమ్మవార్ల సువర్ణ మూర్తులకు సుగంధ పరిమళాలు వెదజల్లె రంగురంగుల పుష్పాలతో లక్ష పుష్పార్చన పూజలు చేపట్టారు. పూజలో భక్తులు అధికంగా పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

భువనగిరిటౌన్ : పట్టణంలో 33కేవీ విద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏఈ సాయికృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు హైదరాబాద్ చౌరస్తా, మీనానగర్, తాతానగర్, ఏరియా ఆసుపత్రికి, ఓల్డ్ గ్రంథాలయం, కెకె ఆస్పత్రి, అజయ్ ఆస్పత్రి, బ్రిలియంట్ స్కూలు ప్రాంతాల్లో అంతరాయం ఉంటుందని, పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు.

వలిగొండ : మండలంలోని వెల్వర్తి, పులిగిల్ల సబ్‌స్టేషన్ల పరిధిలో 33కేవీ విద్యుత్ లైన్ల క్రమబద్ధీకరణతో వెల్వర్తి, పులిగిల్ల, కంచనపల్లి, గోలిగూడెం గ్రామాల్లో బుధవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ ఏఈ జె.నరసింహ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

సైబర్ నేరాలపై అవగాహన

గుండాల : మండల కేంద్రంలో సైబర్ నేరాలు, మత్తు పదార్థాల నిర్మూలనపై మంగళవారం గ్రామస్తులకు ఎస్ఐ సైదులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సమావేశంలో పీసీలు ప్రశాంత్, నరేష్, బీజేపీ మండల అధ్యక్షుడు మల్లేష్ ఉన్నారు.

క్షుద్ర పూజల కలకలం

మోత్కూరు : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు క్షుద్ర పూజలు నిర్వహించిన విషయం కలకలం రేపింది. కళాశాలకు గేటు లోపలికి ప్రవేశించి ఆవరణలోని కొంత దూరంలో పసుపు, కుంకుమ, నిమ్మకాయలు, కోడి తలకాయలు ఉంచి పూజలు నిర్వహించినట్లు సమాచారం. దీంతో కళాశాల విద్యార్థులు ఆందోళన చెందారు.

వరిగడ్డి దగ్ధం

వలిగొండ : విద్యుత్ తీగలు తగిలి డీసీఎం వాహనంలో తరలిస్తున్న గడ్డి దగ్ధమైంది. ఈ ఘటన మండలంలోని ఏదుళ్లగూడెం గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. మండలంలోని పొద్దటూరు నుంచి రామన్నపేటకు చెందిన ఎర్ర నర్సింహ తన గ్రామానికి డీసీఎం వాహనంలో వరిగడ్డిని (పశు గ్రాసం) తరలిస్తుండగా ప్రమాదవశాత్తు ఏదుళ్లగూడెం గ్రామంలోకి రాగానే విద్యుత్ వైర్లు తగిలి మంటలు చెలరేగాయి. దీంతో గ్రామస్తులు ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో రామన్నపేట ఫైర్ సిబ్బంది వచ్చి మంటలు ఆర్పివేశారు. అప్పటికే డీసీఎం వాహనంలోని వరిగడ్డి పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటనలో డీసీఎం వాహనానికి, వ్యక్తులకు ఎలాంటి నష్టం జరగలేదని రామన్నపేట అగ్నిమాపక సిబ్బంది గోపాల్ తెలిపారు.

కరపత్రం విడుదల

భువనగిరిటౌన్ : పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయంలో ఈనెల 16నుంచి నిర్వహించే మండల పూజ మహోత్సవాల కరపత్రాన్ని ఆలయ చైర్మన్ అయిత రాములు, అధ్యక్షుడు నూనె వెంకటేశ్వర్లు మంగళవారం విడుదల చేశారు. కార్యక్రమంలో పాలకుర్తి వేణుమాధవ్, పి.సోమన్న ఉన్నారు.

తాటిచెట్లు నరికిన వారిపై చర్యలు తీసుకోవాలి

భూదాన్‌పోచంపల్లి : మండలంలోని జలాల్‌పురంలో తాటిచెట్లను నరికివేసిన పిట్ట భాస్కర్‌రెడ్డిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని గౌడ సంఘం అధ్యక్షుడు పాలకూర్ల కుమార్, ఉపాధ్యక్షుడు బైరు జంగయ్య, ప్రధాన కార్యదర్శి కొయ్యడ శ్రీనివాస్ మంగళవారం డిమాండ్ చేశారు. అక్రమంగా తాటిచెట్లను నరికిన వారిపై చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కోరారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లో కాపర్ వైరు చోరీ

రామన్నపేట : వ్యవసాయ పొలంలోని ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు పగులగొట్టి అందులోని కాపర్ వైరును చోరీ చేశారు. ఈ సంఘటన మండలంలోని జనంపల్లి గ్రామంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామశివారులోని నక్క చిన్నరుక్కయ్య వ్యవసాయ బావి ఉన్న సింగిల్‌ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం రాత్రి పగులగొట్టి కాపర్‌వైరును చోరీ చేశారు.

పశు సంపదపై అవగాహన పెంచుకోవాలి

మోత్కూరు : పశు సంపదపై రైతులు అవగాహన పెంచుకోవాలని నల్లగొండ పశుగణాభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్ అధికారి (డీఎల్‌డీఏ) డాక్టర్ రాజశేఖర్ అన్నారు. మండలంలోని దాచారం గ్రామంలో పశుగణాభివృద్ధి, పశు సంవర్ధక శాఖ సంయుక్త సహకారంతో ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి ఆయన హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో మోత్కూరు పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు మోతిలాల్, గోపాలమిత్ర సూపర్‌వైజర్ మర్రి మహేష్, ఆఫీస్ సబార్డినేట్ అనిల్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

బొమ్మలరామారం : మత్స్య కార్మికులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మత్స్య శాఖ జిల్లా అధికారి రాజారాం అన్నారు. మండలంలోని మర్యాల మత్స్య పారిశ్రామిక సహకార సంఘం పరిధిలోని మేడిపల్లి ఊర చెరువు, మర్యాల ఈదుల్ల చెరువులో మంగళవారం 96వేల చేపపిల్లలను ఆయన వదిలి మాట్లాడారు. కార్యక్రమంలో ఏఈఓ రాజశేఖర్, మర్యాల, మేడిపల్లి గ్రామాల ప్రత్యేక అధికారులు రామానుజారెడ్డి, గణేష్, మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు ప్యారారం రాములు, కార్యదర్శి అశోక్, సత్యనారాయణ, రాజయ్య, హరికృష్ణ, గోపికృష్ణ పాల్గొన్నారు.